క్లుప్తంగా

వేములూరిపాడులో వైద్యశిబిరం



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడులో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 296 మందికి డాక్టర్ పి.ఎస్తేరురాణి పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ వేసవిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. తరచుగా తాగునీరు. మజ్జిగ, పండ్లరసాలు తీసుకోవాలన్నారు. వడదెబ్బతగలకుండా చూసుకోవాలని, తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే తలకు, ముక్కుకు వస్త్రాన్ని ధరించి వెళ్లాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుకుల పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎస్ఎం రామిశెట్టి అంథోనిరాణి, ఎంపీహెచ్ఏ బాబూరావు, ఆశ కార్యకర్తలు పద్మ, శాంతరాణి, శాంతకుమారి, జోజమ్మ పాల్గొన్నారు.

వైభవంగా సూర్యనారాయణ స్వామి కల్యాణం



ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడులోని కాశీవిశ్వేశ్వర స్వామి వార్షిక మహోత్సవాలలో భాగంగా సూర్యనారాయణ కల్యాణం శుక్రవారం నిర్వహించారు. ఉదయాన్నే స్వామికి నమకచమకాలతో అభిషేకాలు నిర్వహించి సహస్త్ర నామ పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై సూర్యనారాయణ, చాయామాతకు ఆగమశాస్త్రబద్ధంగా వేదపండితులు కల్యాణం జరిపించారు. కల్యాణ పూజల్లో 108 మంది దంపతులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



ఫిరంగిపురం: గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కె.రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని తక్కెళ్లపాడులోని రెండు బోర్లకు నాలుగున్నర లక్షల వ్యయంతో బిగించిన నూతన మోటార్ల పనితీరును శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని తెలియడంతో మోటార్లు బిగించి నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. పూర్తి స్థాయిలో మోటార్లు వినియోగంలోకి వచ్చాయన్నారు. అదే విధంగా గరుడాచలపాలెం ప్రస్తుతం ఉన్న బోరునకు నూతన మోటార్లు బిగించి నీటి ఎద్దడి నివారణకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట సర్పంచి ఎం.విజయలక్ష్మి, గ్రామస్తులు మార్పుల శివరామిరెడ్డి, ఎం.ఈశ్వరరెడ్డి, ఏఈ నాగశ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, సాయి పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్ జండా ఆవిష్కరణ



మంగళగిరి: రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఈనెల 30వ తేదీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని రాజీవ్ సెంటర్‌లోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో రన్‌నకు సంబంధించిన జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాస్టర్లు ఐ.జోసఫ్, అరుణకుమార్, కె.కరుణా నిధి, తిమోతి, కేకే రవి కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అప్రమత్తంగా ఉండాలి

మంగళగిరి: ఎన్నికల నిబంధనలను ఎవరు అతిక్రమించకుండా ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ రిటర్నింగ్ ఎన్నికల అధికారి జేసీ రాజకుమారి అన్నారు. ఎన్నికల కార్యాలయంలో శనివారం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో పాటు అక్రమాల నిరోధించడం, నగదు, మద్యం రవాణాలు జరక్కుండా ఫ్లయింగ్ స్క్వాడ్‌లు అప్రమత్తంగా ఉండాలన్నారు.

త్వరలో మరిన్ని బ్యాంక్ బ్రాంచ్‌లు

నగరంపాలెం: త్వరలో గోరంట్ల, నరసరావుపేట, తెనాలిలో ఏలూరి బ్యాంక్ నూతన శాఖలను ప్రారంభించనున్నట్లు ప్రధాన శాఖ అధికారి ఎస్.సీతారామాంజనేయులు తెలిపారు. బ్రాడీపేట శాఖలో శుక్రవారం ఖాతాదారుల సమావేశం నిర్వహించారు.

లోకేష్‌కు గెలుపురేఖ లేదు

- తండ్రి చేసిన పాపాలే వెంటాడుతున్నాయి
- బీసీ మహిళకు టికెట్ ఇస్తే కించపరిచే విధంగా మాట్లాడతారా?
- పెమ్మసానులు.. మంత్రసానులు డబ్బు మూటలతో వస్తున్నారు
- పేద ప్రజలందరూ జర భద్రంగా ఉండండి
- ఎన్ని డబ్బు మూటలు తీసుకు వచ్చినా విజయం వైఎస్సార్‌సీపీదే
- టీడీపీలో ఉన్న బీసీలు ఆలోచించాలి
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వేదికపై ఎమ్మెల్సీ మురుగుడు, అభ్యర్థి లావణ్య

తాడేపల్లిరూరల్: 'లోకేష్ అనే అబ్బాయికి గెలుపురేఖ లేదు. ఆ రేఖ ఉంటే 2014లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేవాడు. ఇంట్లో తల్లిదండ్రులను హింసించి మరీ మూడు శాఖల మంత్రి పదవి తీసుకున్నాడని' ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. దుగ్గిరాల గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆర్కేతో పాటు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల హాజరయ్యారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో ఎలాగైనా గెలవాలని ఆ బాబు 'పెమ్మసానులను మంత్రసానులను' డబ్బుల మూటలతో మన నియోజకవర్గంలోకి తీసుకొస్తున్నారి ఎద్దేవా చేశారు. మంగళగిరి పట్టణానికి చెందిన టీడీపీ బీసీ నాయకుడు ఒకరు తనకు స్వయంగా ఫోన్ చేసి మా పార్టీ నాయకుల్లో చిత్తశుద్ధి లేదని, డబ్బులతో గెలవాలని విశ్వప్రయత్నం చేస్తున్నారని చెప్పినట్లు చెప్పారు. ఓటును రూ.25 వేలు పెట్టి కొనుగోలు చేయాలని ప్రయత్నిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. నారా వారి కుటుంబానికి బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు అంటే చాలా చులకన అని చెప్పినట్లు వివరించారు. ఈ మధ్యకాలంలో తెలంగాణ ఎన్నికల్లో కేటీఆర్ ఒక బీసీ అభ్యర్థిపై నిలబడితే టీడీపీలో ఉన్న బీసీ నాయకురాలు పద్మశాలి బిడ్డ అయిన పంచుమర్తి అనూరాధ ఒక బీసీ మహిళ మీద ఎలా నిలబడతావు అంటూ కేటీఆర్‌ను ప్రెస్‌మీట్ పెట్టి మరీ ప్రశ్నించారు. ఇప్పుడు మంగళగిరిలో ఒక బీసీ ఆడబిడ్డ అయిన మురుగుడు లావణ్య విషయంలో ఎలా ఎందుకు మాట్లాడడం లేదో మా చెల్లి పంచుమర్తి అనూరాధ చెప్పాల్సిన సమయం వచ్చిందని కోరారు. సామాన్య రైతు కుటుంబం నుంచి రెండు ఎకరాల భూమి కలిగి ఉన్న చంద్రబాబు నాయుడు ఈ రోజు రూ.వేల కోట్లకు అధిపతి ఎలా అయ్యారో మనం అర్థం చేసుకోవచ్చన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో 2014 నుంచి 2019 వరకు చేసిన అభివృద్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో చేసి చూపించామని పేద ప్రజలకు సామాజిక న్యాయం చేసేందుకు ప్రతి ఒక్క కమ్యూనిటీకీ ప్రాధాన్యం ఇస్తూ వారిని గౌరవిస్తూ కమ్యూనిటీ హాళ్లను నిర్మించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వి.రజనీకాంత్, దుగ్గిరాల అధ్యక్షులు ఎస్.రత్నం, బీసీ సెల్ అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ వై.రవిచంద్ర, మార్కెట్ యార్డు చైర్మన్ బాజీ, మైనార్టీ సెల్ నాయకులు సుభాని, సర్పంచులు బాణావత్ ఖుషీబాయి, ఉన్నం ఝాన్సీరాణి, యార్లగడ్డ శ్రీచంద్ర దుర్గాభవాని, ఇత్తడి రమేష్, దాసరి సుందరమ్మ, కొండూరు సుధారాణి, పలుకూరి మేరిమ్మ, షేక్ అజీజున్, బి.శ్రీనివాసరెడ్డి, గంపల గంగాధరరావు పాల్గొన్నారు.

హామీల అమలు ఘనత వైఎస్ జగన్‌దే


ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



ఎస్సీ కాలనీలో అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుచరిత

తాడికొండ: ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆదరించాలని ఎమ్మెల్యే, మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత అన్నారు. శుక్రవారం తాడికొండ ఎస్సీ కాలనీలో పర్యటించిన ఆమె ఇంటింటికీ తిరిగి అందరినీ ఆత్మీయంగా పలకరించారు. తెలుగు బాప్టిస్టు చర్చి, మరనాత చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుచరిత మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పెద్దపీట వేస్తూ కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి పేదవాడి ఖాతాలకు నేరుగా సంక్షేమాన్ని అందిస్తున్న ఏకైక సీఎం దేశంలో ఒకే ఒక్కడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. గతంలో రాజకీయ పార్టీలు విభజించి పాలించి అనే సిద్ధాంతాన్ని పాటిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను రాజకీయంగా, సామాజికంగా అణచివేత ధోరణికి గురిచేసి ఆధిపత్యం ప్రదర్శించేవని, కానీ నేడు అందుకు భిన్నంగా పాలనలోనూ, ఆర్థికంగా పేదలను అందలం ఎక్కించి వారిని ఆర్థికంగా బలోపేతం చేసిన జగనన్నకు అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల కనుసన్నల్లో సంక్షేమ పథకాలు పచ్చ చొక్కాల నాయకులకే అందేవని, నేడు అందుకు భిన్నంగా కొనసాగుతున్న జగనన్న పాలనలో తనకు అర్హత ఉండి సంక్షేమ పథకం అందలేదని చెప్పే వారు ఏ ఒక్కరైనా ఉన్నారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సర్పంచి తోకల సరోజినీ, సొసైటీ చైర్మన్ షేక్ నగీనా, ఉప సర్పంచి వెంకటరెడ్డి, నిడుముక్కల సర్పంచి మాదాసు రత్నకుమారి, ఎంపీటీసీలు ధూళిపాళ్ల నాగేశ్వరరావు, నూతక్కి పరిమళ, పాలడుగు దాసు, వలపర్ల కల్పన, బోడపాటి సుశీల పాల్గొన్నారు.

కోడ్‌ను పట్టించుకోని టీడీపీ



మోతడకలో ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయం, పసుపు రంగు



జీవీ ఆంజనేయులు స్టిక్కర్‌తో తిరుగుతున్న వాహనం

తాడికొండ: ఎన్నికల కోడ్ కూసినా టీడీపీ కార్యాలయాల వద్ద టీడీపీ నాయకులు నిబంధనలు పాటించడం లేదు. యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించి కార్యాలయాల వద్ద అనుమతులు లేకుండా ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. తాడికొండ మండలం కంతేరు గ్రామంలో అధికారులు వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెకు తెల్లరంగు వేసి, టీడీపీ కార్యాలయం వద్ద జెండా దిమ్మెను వదిలేయడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తాడికొండ మండలం మోతడకలో టీడీపీ కార్యాలయమే ప్రభుత్వ స్థలంలో నిర్మించడం విడ్డూరం, తొలుత సచివాలయం కూడలిలో ప్రభుత్వ స్థలంలో ఎన్‌టీఆర్ బొమ్మను నిర్మించి తరువాత దానికి రూములు నిర్మించి పార్టీ కార్యాలయంగా మార్చారు. దానికి ఎలాంటి ఇంటి పన్ను చెల్లించడం లేదు. అయితే అధికారులు ఎన్‌టీఆర్ విగ్రహంతో పాటు పార్టీ సింబల్స్, ఫొటోలను మూసివేసి అనధికారిక కార్యాలయానికి అనుమతులు మంజూరు దిశగా పావులు కదుపుతున్నట్లు సమాచారం.

నట్టేట ముసిగిన మొక్కజొన్న రైతు

55 రోజులు గడిచినా మొక్కజొన్న కంకులురాని వైనం



మైకో ఎంఆర్‌ఎం 4065 మొక్కజొన్న విత్తనాల కవర్‌ను చూపిస్తున్న రైతు షేక్ ఖాదర్ బాషా

తాడేపల్లిరూరల్: ప్రచారం హోరెత్తించి రైతులను నట్టేట ముంచిన వైనం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాధిత రైతు అయిన షేక్ ఖాదర్ బాషా అందించిన వివరాలు.. తుమ్మపూడిలో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. వరి కోతల అనంతరం మొక్కజొన్న వేసేందుకు సిద్ధమవుతుండగా ఓ మొక్కజొన్న కంపెనీకి చెందిన వారు మా కంపెనీ మొక్కజొన్న విత్తనాలు కొనండి దిగుబడులు పెంచుకోండి అంటూ ఫొటోలు చూపించి ఆ విత్తనాలు కొనేదాకా ప్రాణం తీశారు. విత్తనాలు కొనుగోలు చేసి నాటిన తరువాత మొక్కజొన్న కండెలు వచ్చే సమయానికి మొక్క పూర్తిగా ఎండిపోయింది. ఇదేమని ప్రశ్నించగా షాపు యజమాని కంపెనీ వారికి ఫోన్ చేసి మాట్లాడగా వారు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని సదరు రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వరి పంట అయిన తరువాత మైకో కంపెనీకి చెందిన ఏజెంట్లు ఎంఆర్‌ఎం 4065 మొక్కజొన్న విత్తనాలు నాటితో గతంలో కన్నా దిగుబడి బాగా వస్తుందని చెప్పడంతో ఆ కంపెనీకి చెందిన విత్తనాలు నాటినట్లు చెబుతున్నాడు. నా పక్క పొలంలో వేరే కంపెనీ విత్తనాలు నాటారు. ఆ పంట బాగానే ఉంది. నా పంట మాత్రం దెబ్బతింది. నాతో పాటు మైకో కంపెనీ మొక్కజొన్న విత్తనాలు వాడిన రైతుల పరిస్థితి ఇదేవిధంగా ఉందని, ఇప్పటి వరకు సుమారు 40 నుండి 60 వేలు ఖర్చు అయిందని, ఇది కాకుండా అదనంగా కౌలు చెల్లించాల్సి ఉంది. వ్యవసాయాధికారులు స్పందించి నష్టపరిహారం ఇప్పించాలని షేక్ ఖాదర్ బాషా కోరుతున్నాడు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పాత గుంటూరు: ఆర్. అగ్రహారంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, దీక్షాధారణ, అంకురారోపణ, వాస్తు హోమం ధ్వజ పటాధీవాసం తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, దేవస్థాన కార్యదర్శులు పాతకోట బ్రాహ్మణయ్య నాయుడు, దాసరి భాస్కరరావు పర్యవేక్షించారు.

శరణాలయానికి రూ.2 లక్షల విలువైన సామగ్రి అందజేత



మంగళగిరి: నగర పరిధిలోని చినకాకానిలోని షైన్ ఆనంద శరణాలయానికి గుంటూరు ఎస్‌బీఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) అడ్మిస్ట్రేషన్ కార్యాలయం ఆధ్వర్యంలో రూ.2లక్షల విలువైన గృహోపకరణాలను శుక్రవారం అందజేశారు. ఎస్‌బీఐ డీజీఎం దినేష్ గులాటి సతీమణి పూజా గులాటి, ఆర్ఎం విశ్వేశ్వరరావు, చీఫ్ మేనేజర్ హెచ్ ఆర్ కిషోర్ కుమార్, డెప్యూటీ మేనేజర్ బాబు, మేనేజర్ శివయ్య, మురళీకృష్ణ, నాగరాజు శుక్రవారం శరణాలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో శరణాలయ నిర్వాహకులు డీజీ నాయక్, సంధ్యారాణి పాల్గొన్నారు.

ట్రాక్టరు కిందపడి యువకుడి దుర్మరణం

తాడికొండ: ట్రాక్టరు కిందపడి యువకుడు మృతి చెందిన ఘటన తుళ్ళూరు మండలం నెక్కల్లు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పవిత్ర శుక్రవారం సందర్భంగా క్రైస్తవు పెదపరిమి నుంచి అనంతవరం వరకు పాదయాత్ర చేపట్టారు. తిరుగు ప్రయాణంలో కంకర లోడుతో వెళుతున్న ట్రాక్టరుపై ఎక్కగా నెక్కల్లు గ్రామ డొంక మలుపు వద్దకు రాగానే యువకుడు ఎర్రమాల చందు(14) జారిపడటంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ట్రాక్టరుపై నలుగురు యువకులు ఎక్కినట్లు సమాచారం కాగా ఓ యువకుడు జారిపడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ కవాతు



మేడికొండూరు: శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరగాలని సీఐ దార్ల జయకుమార్ తెలిపారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం కేంద్ర ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ జయకుమార్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని, ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 25వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు, విష్వక్సేన ఆరాధన, సామూహిక, విష్ణు, లలితా సహస్రనామ, హనుమాన్ చాలీసా పారాయణలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన గజ వాహనంపై ఉత్సవమూర్తులకు నగరోత్సవం నిర్వహించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు వేద పండితుల ఆధ్వర్యంలో మంత్రార్థాలను వివరిస్తూ కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య అధ్యక్షత వహించారు. చిన్మయ మిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి అనుగ్రహభాషణం చేశారు. సభలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, ప్రముఖ వ్యాపారవేత్త మర్రెడ్డి రామకృష్ణారెడ్డి, సాహితీవేత్తలు గుడిమెళ్ల శ్రీకూర్మనాథస్వామి, డాక్టర్ డి.యస్. దీక్షిత్, నోరి నారాయణమూర్తి, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సూర్యదేవర వెంకటేశ్వరరావు, లంకా విజయ బాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామీణులకు తపాల శాఖ బీమా పథకం



పలగాని సుబ్బారావుకు బీమా చెక్కు అందజేస్తున్న సబ్ డివిజనల్ ఆఫీసర్ రాధాకృష్ణమూర్తి

మంగళగిరి: గ్రామీణ ప్రజలకు సులభతరంగా తక్కువ ఖర్చుతో బీమా పథకాన్ని తపాల శాఖ నూతనంగా ప్రవేశపెట్టిందని ప్రజలంతా బీమా పథకాన్ని వినియోగించుకోవాలని మంగళగిరి హెడ్ పోస్టాఫీసు హెడ్ పోస్ట్‌మాస్టర్ ఎం.నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం పోస్టాఫీసులో విలేకరుతో మాట్లాడారు. పోస్టాఫీసులో బీమా ఉండి ఇటీవల మృతి చెందిన క్రోసూరి శ్రీవాణి నామిని అయిన పలగాని సుబ్బారావుకు మేనేజర్ పి. సుబ్రమణ్యం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ పోస్టాఫీసులో తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ పొందవచ్చన్నారు. దేశంలో ఇతర బీమా కంపెనీల కన్నా బోనస్ రూపంలో అత్యధిక వడ్డీ పొందవచ్చన్నారు. జీవితానికి బీమా రక్షణతో పాటు ఆదాయపు పన్ను మినహాయింపు పాలసీ విలువ రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకు ఉండగా మూడు సంవత్సారాల అనంతరం రుణ సౌకర్యం వుంటుందన్నారు. ప్రీమియంను దేశంలో ఏ పోస్టాఫీసులోనైనా కట్టవచ్చన్నారు. పాలసీదారు మధ్యలో మరణిస్తే వాయిదాలతో సంబంధం లేకుండా పాలసీ విలువ అప్పటి వరకు జమ అయిన బోనస్ చెల్లించబడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ శ్రీవాణి ఏడాదికి రూ 977లు మూడు సంవత్సరాలు చెల్లించి రూ 1లక్ష పాలసీ తీసుకోగా నామిని బోనస్‌తో కలిపి రూ 1,20,335లు చెక్కు అందజేయడం జరిగిందన్నారు.

నూతన ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలి

కెనడా సీపీపీ డైరెక్టర్ ఆఫ్ ఇంజినీరింగ్ హేమ జంపాల



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సుమన్, కావ్య, శ్రీకాంత్ రెడ్డి తదితరులు

తాడేపల్లిరూరల్: విద్యార్థులు విద్యతో పాటు సరికొత్త ప్రాజెక్టులు, నూతన ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలని కెనడా సీపీపీ డైరెక్టర్ ఆఫ్ ఇంజినీరింగ్ హేమ జంపాల పేర్కొన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జ్రోత్రియా- 24 వేడుకలను శుక్రవారం ప్రారంభించారు. హేమ జంపాల మాట్లాడుతూ కేఎల్‌యూలో విద్యార్థులకు అధునాతన లేబొరేటరీలు, అంకిత భావం కలిగిన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని అన్నారు. ఈసీఈ విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ రెండు విభాగాల్లో మంచి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. జ్రోత్రియా చైర్ పర్సన్ డాక్టర్ కేసీహెచ్ కావ్య, కన్వీనర్ పి.శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ వేడుకలలో ఈసీఈ విభాగ విద్యార్థులందరూ నెట్‌వర్క్, షోకేస్ టాలెంట్ ప్రదర్శించి వారి ప్రతిభా పాటవాలను ప్రదర్శించారని అన్నారు. యూనివర్సిటీ ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్ మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికితీయడానికి ఇలాంటి సాంకేతిక వేడుకలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ టీకే రామకృష్ణారావు, ఈసీఈ డైరెక్టర్ పరిశోధన, ప్లేస్‌మెంట్ అధిపతి డాక్టర్ కె.శరత్‌కుమార్, విద్యార్థి విభాగం సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



ప్రియదర్శిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న పార్టీ అభ్యర్థి లావణ్య, ఎమ్మెల్సీ హనుమంతరావు



తాడేపల్లికి చెందిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న లావణ్య, ఎమ్మెల్సీ..

పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన అభ్యర్థి లావణ్య, ఎమ్మెల్సీ

మంగళగిరి: వైఎస్సార్ సీపీలోకి వివిధ పార్టీల నుంచి భారీగా చేరికలు జరిగాయి. పట్టణంలోని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు నివాసంలో శుక్రవారం రత్నాల చెరువుకు చెందిన కట్టా అనుపమ ప్రియదర్శిని ఆధ్వర్యంలో 200 కుటుంబాలు చేరగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య, ఎమ్మెల్సీ హనుమంతరావు మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వారిని అభినందించి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మహ్మద్ రఫీ, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. తాడేపల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులు జగన్నాథం సాంబశివరావు, పేరం నాగరాజు, వానపల్లి వితేష్, పేరం నాగమణి,మొగిలి దుర్గలతో పార్టీలో చేరిన వారికి లావణ్య, హనుమంతరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. రానున్న ఎన్నికలలో లావణ్యను భారీ మెజార్టీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తాడేపల్లి వైఎస్సార్ సీపీ నాయకులు మేడా వెంకటేశ్వరరావు(పండు), బలసాని అనిల్, గుత్తి అశోక్, పేరం శ్రీనివాసరావు, పొన్నరసు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): ప్రేమ వివాహం చేసుకోలేదని మనస్తాపంతో యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ రహీంరెడ్డి కథనం మేరకు గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం దొండపాడుకు చెందిన చింతబత్తిన నవ్యశ్రీ అపాచీ కంపెనీలో పనిచేస్తూ సూళ్లూరుపేట నాగరాజుపురంలో అద్దె ఇంట్లో సహచర మహిళా కార్మికులతో కలిసి ఉంటోంది. నాయుడుపేటకు చెందిన రవి అనే సహచర కార్మికుడితో పరిచయం పెరిగింది. వీరిద్దరూ వివాహం చేసుకోవాలని నవ్యశ్రీ ఇంట్లో తన అక్కతో చెప్పడంతో ఆమె మందలించింది. అదే విధంగా రవిని అడగడంతో ఆయన కూడా ఇంట్లో తల్లిదండ్రులతో చెప్పి చేసుకుంటాను అని చెప్పాడు. దీంతో నవ్యశ్రీ మనస్తాపానికి గురై గురువారం గదిలో ఎవరూ లేకుండా చూసుకుని ఉరివేసుకుని మృతి చెందింది. ఘటన జరిగిన కొద్ది సేపటికి పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ రహీంరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అనుమానాస్పద మృతి కోణంలో విచారించగా విచారణలో ఆత్మహత్యగా తేలిందని ఎస్ఐ చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



పట్నంబజారు: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసు స్టేషన్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ షేక్ అన్వర్ బాషా శుక్రవారం వివరాలు వెల్లడించారు. తేలిగ్గా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో వ్యసనాలకు బానిసలైన ఇద్దరు గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులు పక్కా సమాచారం అందుకున్నారు. ఈ క్రమంలో నెహ్రూనగర్, 7వ లైను చివర న్యూ గుంటూరు రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు కొత్తపేట ఎస్‌హెచ్ఓ అన్వర్‌బాషా, ఎస్ఐ ఎం.హనుమంతరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేయగా ఇద్దరు యువకులు పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ప్రస్తుతం నల్లపాడులోని స్నేహ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉండే బెంగళూరుకు చెందిన నాగవర కృష్ణార్జున, సంపత్‌నగర్‌కు చెందిన వి.భానుప్రకాష్‌గా గుర్తించినట్లు చెప్పారు. వీరి నుంచి నాలుగు కేజీల 600 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి గంజాయి తెప్పించి శివారు ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఏఎస్ఐ ఎం.ఆంథోని, హెడ్ కానిస్టేబుల్ నక్కా రవి, కానిస్టేబుల్ ఎన్.ఎస్.ఆర్.కోటేశ్వరరావు, దేవభిక్షం, షేక్ నజీర్‌లను ఈస్ట్ సబ్ డివిజన్ ఏఎస్పీ నిశికేష్ షలేకే అభినందించారు.